ఓయూలో భవన నిర్మాణ పనులు బంద్

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్నికల కోడ్‌తో ఓయూలో జరుగుతున్న వివిధ భవన నిర్మాణాల పనులను నిలిపేయాలని పాలక మండలి (ఈసీ) నిర్ణయించింది. శుక్రవారం ఓయూ పాలక మండలి సమావేశం జరిగింది. ఈ విద్యా సంవత్సరం వివిధ పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల నుంచి నిరంతర మూల్యాంకణ పద్ధతిని ప్రవేశ పెట్టేందుకు ఈసీలో చర్చ జరిగినట్లు సమాచారం. విశ్రాంత ప్రొ.అన్సారీకి పింఛన్ చెల్లింపుపై చర్చించినట్లు తెలుస్తోంది. అన్సారీ 1997 ఉద్యోగంలో చేరిన నాటి నుంచి రిటైర్మెంట్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తుండగా.. ప్రభుత్వం నుంచి అనుమతి రానందున ఈ బెనిఫిట్స్‌తో పాటు పెన్షన్ కూడా చెల్లించకూడదని ఈసీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

బీ-ఫారమ్ అందుకున్న మంత్రి తలసాని



బీ ఫారమ్ అందజేస్తున్న కేసీఆర్

సనత్‌నగర్: సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఆర్ఎస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం బీఫారమ్‌ను అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక మెజార్టీ సాధించే మొదటి 5 మందిలో తాను ఉండాలన్నదే తన ఆశయమన్నారు. సనత్‌నగర్‌లో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలే తిరిగి బీఆర్ఎస్‌కు పట్టం కడతాయని ధీమా వ్యక్తం చేశారు.

బ్యాగుల దుకాణంలో అగ్ని ప్రమాదం

రూ.5 లక్షల మేర ఆస్తినష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాంగోపాల్‌పేట్: పాలికాబజార్‌లోని ఓ బ్యాగుల దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. శుక్రవారం జరిగిన ఈ ఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చిలకలగూడకు చెందిన సయ్యద్ మజాద్ హుస్సేన్ పాలికాబజార్‌లో సిటీ కలెక్షన్స్ పేరుతో బ్యాగుల దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి 11గంటల సమయంలో షాపును మూసేసి ఇంటికెళ్లాడు. శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో సెల్లార్ ఎంట్రన్స్ వద్ద ఉన్న దుకాణం నుంచి దట్టమైన పొగలు రావడం గమనించి స్థానికులు మార్కెట్ పోలీసులతో పాటు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో ఒకే దుకాణం దగ్ధం కావడంతో భారీ ప్రమాదం తప్పింది.

- పాలికాబజార్‌లోని సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌లో వందల సంఖ్యలో షాపులు ఉన్నాయి. జీహెచ్ఎంసీ ఆర్ఎఫ్ఓ ప్రసన్నకుమార్, అగ్నిమాపక శాఖ డీఎఫ్ఓ మధుసూదన్, ఏడీఎఫ్ఓ ధనుంజయరెడ్డి, ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు, తదితరులు హాజరై పరిశీలించారు.

మూడు నెలల క్రితమే అగ్ని ప్రమాదం..

జూలై 9న పాలికాబజార్ కాంప్లెక్స్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఓ బట్టల దుకాణంలో అగ్నిప్రమాదం చోటు చేసికుంది. మూడు నెలల్లోనే మరో అగ్నిప్రమాదం జరగడం గమనార్హం.

సరస్వతీ నమస్తుభ్యం



దేవీ నవరాత్రి మహోత్సవాలు కనుల పండు వగా జరుగుతున్నాయి. అమ్మవారు శుక్రవారం సరస్వతి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆడిపాడారు. చిన్నారులతో అక్షరాభ్యాసం, మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. పలు అమ్మవారి ఆలయాలు, మండపాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం

వినతిపత్రం అందజేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో డిగ్రీ, పీజీ కోర్సుల బ్యాక్‌లాగ్ పరీక్షలను మరోసారి నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. 2010–14 బ్యాచ్ విద్యార్థులకు, 2015–16 వన్‌టైం ఛాన్స్ విద్యార్థులు అధిక ఫీజుల కారణంగా బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరుకాలేకపోయారన్నారు. పరీక్ష ఫీజును తగ్గించి మరోసారి పరీక్షలు చేపట్టాలని కోరారు.

కారు ఢీకొని కానిస్టేబుల్‌కు గాయాలు

రాంగోపాల్‌పేట్: వాహనాలు తనిఖీలు చేస్తున్న ఓ కానిస్టేబుల్‌ను వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 18న తెల్లవారు జామున 2:10 గంటల సమయంలో గోపాలపురం పోలీసులు చిలకలగూడ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. విధుల్లో ఉన్న మహేష్ అనే కానిస్టేబుల్ రైల్ నిలయం నుంచి వేగంగా వస్తున్న ఓ కారును నిలిపేందుకు యత్నించాడు. కారు ఆపకుండా అతడిని ఢీకొట్టి వేగంగా వెళ్లిపోయింది. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. నిర్లక్ష్యంగా కారును నడిపి ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా కారుతో పాటు నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నారు.

బ్రహ్మోత్సవాలు

చిలకలగూడ: శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ 46వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.

సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం: తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తోంది. శుక్రవారం జరిగిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున్న పాల్గొని బతుకమ్మ ఆడిపాడారు.

ఇంద్రాసేనారెడ్డికి శుభాకాంక్షలు

లాలాపేట: ఇటీవల త్రిపుర రాష్ట్రం గవర్నర్‌గా నియమితులైన నల్లు ఇంద్రసేనారెడ్డిని మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం కలిసి ఆమె శాలువాతో సత్కరించి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీ.. నిందితుల అరెస్ట్

సనత్‌నగర్: నడుచుకుంటూ వెళ్లే వారిని టార్గెట్ చేసుకుని వారి చేతుల్లోని సెల్‌ఫోన్లను తస్కరించుకుపోతున్న ఇద్దరు దుండగులను బేగంపేట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 3లక్షల విలువైన 9 సెల్‌ఫోన్లతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరు పాత నేరస్తుడు. బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఇన్‌స్పెక్టర్ భాస్కర్, డీఐ మల్లేశం, బేగంపేట ఏసీపీ రామలింగరాజు వివరాల ను వెల్లడించారు. బోయిన్‌పల్లి హస్మత్‌పేటకు చెందిన బొబ్బిలి అనిల్ (40), బండారి కృష్ణ (23)లు బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరేడ్‌గ్రౌండ్, బాలంరాయి, జూబ్లీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పాదచారుల నుంచి సెల్‌ఫోన్లను లాక్కొని బైక్‌పై పరారవుతుంటారు. గత 3 నెలల్లో నాలుగు చోట్ల సెల్‌ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. పోలీసులు వాహనాల తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన ఇరువురిని విచారించగా అసలు విష యం ఒప్పుకున్నారు. నిందితులు 9 చోట్ల సెల్‌ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడగా 4 బేగంపేట పోలీస్‌స్టేషన్, ఒకటి బోయిన్‌పల్లి, మరోటి ఆల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేశారు. మరో మూడు ఘటనలు ఎక్కడ జరిగాయనే విషయమై విచారిస్తున్నామని ఏసీపీ తెలిపారు. నిందితుల్లో ఒకడు బండారి కృష్ణ గతంలో ఒక హత్య, మరో చోరీ కేసులో నిందితుడని పోలీసులు తెలిపారు.